షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక





సంపుటి : 1 సంచిక : 241 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 25 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 240 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 31 july 2024 PAGES : 8 PRICE : 3/-

## ఆశల పల్లకిలో

# పల్లె పోరు!



- ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటూ జిల్లా పంచాయతీ అధికారులకు ఎస్ఈసీ ఉత్తర్వులు
- ఓటర్ల ఫొటోలతో కూడిన తుది జాబితా ప్రచురణ అనంతరం వాటిలో మార్పులు, చేర్పులకు అవకాశం

హైదరాబాద్

గత ఆరు నెలలుగా ఊరిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఆశావహులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి సర్పంచులు, వార్డు సభ్యుల సాధారణ ఎన్నికల కోసం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం ఎస్ఈసీ, బుధవారం షెడ్యూలు విడుదల చేయడంతో గ్రామాల్లో సమీకరణాలు మొదలయ్యాయి. ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటూ జిల్లా పంచాయతీ అధికారులకు ఎస్ఈసీ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు వచ్చే నెల 6 నుంచి సవరణ ప్రక్రియ ప్రారంభించి 21న పంచాయతీల్లో వార్డుల వారీగా తుది జాబితా ప్రకటించాలని ఆదేశించింది. అయితే ఈ జాబితా ఏ విధంగా రూపకల్పన చేయాలనే దానిపై ఈ నెల 12న జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ అందించిన విషయం తెలిసిందే. శాసనసభ ఓటర్ల జాబితా అనుసరించి 2024 ఫిబ్రవరి 20న ప్రచురితమైన జాబితా ఆధారంగానే గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా కొత్త జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల కమిషనర్ సూచించారు. ఓటర్ల ఫొటోలతో కూడిన తుది జాబితా ప్రచురణ అనంతరం వాటిలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. మొత్తం ప్రక్రియను ఎంపీడీవోలు, ఎంపీవోలు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలు, - మిగతా3లో



## ఢిల్లీకి వచ్చిన ప్రధాని మోదీ

- గత 45 ఏళ్లలో పోలాండ్‌లో పర్యటించిన భారత ప్రధాని మోదీయే కావడం విశేషం
- భారత సంతతి ప్రజలను కలుసుకుని భారతదేశ ప్రగతి, వసుధైక కుటుంబం ఫిలాసఫీపై చర్చించారు
- రష్యాతో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు జెలెన్‌స్కీతో కలిసి నివాళులు అర్పించారు

## మళ్లీ హీటెక్కిన రుణమాఫీ

# పాలిటిక్స్

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం
- చాలామంది రైతులకు మాఫీ చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.
- రాష్ట్ర రాజకీయాలన్నీ రుణమాఫీ కేంద్రంగానే సాగుతున్నాయి
- అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల




హైదరాబాద్

తెలంగాణలో రుణమాఫీ అమలుపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. చాలామంది రైతులకు మాఫీ చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. సాంకేతిక కారణాల వల్ల కొందరికి మాఫీ కాలేదని.. అర్హులందరికీ మాఫీ జరుగుతుందని కాంగ్రెస్ సర్కార్ చెబుతోంది. తాజాగా యాదాద్రి ఆలయ కేంద్రంగా రుణమాఫీ పాలిటిక్స్ హీటెక్కాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేత మధ్య రుణమాఫీ వివాదం ముదురుతోంది. రుణమాఫీ వివాదంలోకి దేవుళ్ళను లాగుతున్నారా..? అంటే హరీష్ రావు టెంపుల్ టూర్ అందుకే అంటోంది కాంగ్రెస్. రాష్ట్ర రాజకీయాలన్నీ రుణమాఫీ కేంద్రంగానే సాగుతున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. రుణమాఫీ అయిందని - మిగతా3లో

## మేడిపల్లి రాఘవేంద్ర హొటల్‌లో

# దోశలో మాడిన బొద్దింక దర్శనం

షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి ఆగస్టు 24



మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ లో దారుణం చోటు చేసుకుంది పీర్జాదిగూడలో వరంగల్ జాతీయ రహదారి కి పక్కనే ఉన్న శ్రీ రాఘవేంద్ర హొటల్ లో శుక్రవారం టిఫిన్ చేయాలని వెళ్లిన ఓ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. హొటల్ లో దోస ఆర్డర్ చేయగా దోసలో మాడిన బొద్దింక దర్శనం ఇచ్చింది. దీంతో ఖంగుతిన్న కస్టమర్స్ హొటల్ సిబ్బందిని నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేసారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలను సేకరించారు. తినే ఆహారంలో బొద్దింక కనిపించిందని ఇలాంటి ఆహారాన్ని వడ్డించి ప్రజల ప్రాణాలతో చెలగాట%శీ% ఆడుతున్నారని హొటల్ సిబ్బందిని నిలదీశారు. తనిఖీలు నిర్వహించినా నిర్వాహక ఎల్లో మార్పు రావడంలేదని వాపోయారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు హొటల్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని లైసెన్సు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## హైడ్రా పేరుతో

# హైడ్రామా..

- కిషన్ రెడ్డి విమర్శలు
- "హైడ్రామాకు భాగ్యనగరం కేరాఫ్‌గా మారింది
- నిర్మాణాలు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చిన వారే నేడు అక్రమ కట్టడాలని కూల్చేస్తూ డ్రామాలాడుతున్నారు
- అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారు? విద్యుత్, నీరు, రోడ్ల సదుపాయాలు ఎలా కల్పించారు?



హైదరాబాద్

రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు కూల్చివేతలు చేస్తోందని ఆరోపించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. "హైడ్రామాకు భాగ్యనగరం కేరాఫ్‌గా మారింది. నిర్మాణాలు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చిన వారే - మిగతా3లో



## మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం, బుల్డోజర్లను ఉపయోగించడం ఆందోళనకరం

- 'ఒకరి ఇంటిని కూల్చివేయడం. వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయం.
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలపై పదే పదే దాడులు జరుగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

## రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి

# ఏం చేస్తున్నట్టు

- "నేను రాను బిడ్డ సర్కారు దవాఖానాకు" అనే రోజులు పునరావృతం అయ్యాయి
- రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారింది
- ప్రజారోగ్య సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వా నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనం
- ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వైద్య రంగం ఉన్నత శిఖరాలకు చేరిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అనేక విప్లవాత్మక పథకాలకు, తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. నిర్దిష్టమైన ప్రణాళిక, పటిష్టమైన చర్యలతో వైద్యరంగంలో అట్టడుగున ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని హరీశ్‌రావు అన్నారు. కానీ ఈ తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్య, ఆరోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని - మిగతా3లో

# ఒక వైపు పచ్చదనం పరిశుభ్రత
# మరోపక్క టేక్మాల్ లో పచ్చని చెట్లు నేలమట్టం

**గ్రామ పంచాయతీలు నాటిన మొక్కలను నేడు విద్యుత్తు శాఖ అధికారులు నరికి వేత**

**షణ్ముఖ వెలుగు టేక్మాల్ ప్రతినిధి ఆగష్టు 24:** మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్ మండల కేంద్రంలో టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ లో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ లో నాటిన మొక్కలను నాటి చెట్టుగా పెంచితే పంచాయతీ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా శనివారం విద్యుత్తు వైర్ లకు కొమ్మలు తాకుతున్నాయని కొమ్మలను నరకాల్సింది పోయి పూర్తిగా చెట్లను విద్యుత్తు శాఖ అధికారులు నరికి వేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్షల



రూపాయలు ఖర్చుపెట్టి వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపు నిస్తుంటే విద్యుత్తు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వృక్షాలను నరికి



వేసిన విద్యుత్తు శాఖ అధికారులపై సంభందిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు

# కోరుట్ల పట్టణం లో
# హైడ్రా చట్టం అమలు చేయాలి

**ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్**

**షణ్ముఖ వెలుగు కోరుట్ల క్రైం ప్రతినిధి ఆగష్టు 24:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకువచ్చిన హైడ్రా ( హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) ద్వారా స్పెషల్ ఫోకస్ పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చట్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మరియు కోరుట్ల లో అమలు చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ కోరారు.

శనివారం కోరుట్ల లోని సి ప్రభాకర్ గ్రంథాలయంలో అధ్యక్షులు చెన్న విశ్వనాథం తో కలిసి పేట భాస్కర్ పాత్రికేయులతో మాట్లాడుతూ పట్టణంలోని తాళ్ల చెరువు మద్దెలచెరువు ఎఫ్ టి ఎల్ భూములు కంచెరకుంట పితిరి కుంట కుమ్మరి కుంట లస్మాగౌడ్ కుంట కోరుట్ల వాగు పరివాహక ప్రాంతం బఫర్ జోన్ రోడ్లు చెరువుల కాల్వలు దేవాలయ భూములు వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతు కబ్జాదారుల కబంధ హస్తాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రేపటి తరానికి ప్రకృతి అందించిన చెరువులను కుంటలను కాపాడాలని పేరుకు పెద్ద మనుషుల్లా ఉంటూ ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడం



సరి కాదని ఇకనైనా స్వచ్ఛందంగా ప్రభుత్వ భూములను ప్రభుత్వ అధీనంలోకి అందించాలని కబ్జాదారుల కు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి మంచి నిర్ణయంతో తెచ్చిన హైడ్రా చట్టం కోరుట్ల లో కూడా అమలు చేయాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజా ప్రతినిధులును పేట భాస్కర్ కోరారు. ఈ సమావేశంలో కోరుట్ల డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు చెన్న విశ్వనాథం గంగపుత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇట్యాల రాజేందర్ కార్మిక నేత సుతారి రాములు కవి రాస భూమయ్య జేఏసీ అంబేద్కర్ సంఘాల నాయకులు శనిగారపు రాజేష్ జాగర్ల రాజయ్య ఎస్ రాజయ్య బింగి లక్ష్మీ కాంతం అందె వంశీ సామల్ల రాజేశం ఎనుగందుల రాజనర్సయ్య మరిపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విప్ బీర్ల ఐలయ్య కు వినతి



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి ఆగస్టు 24:** భాగ్యనగరంలో పేద ప్రజలకు అందుబాటులో ఉండే ఐదు రూపాయలకే భోజనం పథకాన్ని యాదాద్రి పుణ్యక్షేత్ర సన్నిధి సమీపంలో రోజు రెండు పూటలా ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ భజరంగ్ దళ్ ల ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కు వినతి పత్రం అందజేశారు. నిత్యం పెద్ద ఎత్తున యాదగిరి పుణ్య క్షేత్రాన్ని దర్శించుకునే భక్తులు రాత్రి సమయంలో బస చేసే వారితో పాటు ఇక్కడి సామాన్య భక్తులు వారి ఆకలి తీర్చుకునేందుకు హొటల్స్ ను ఆశ్రయిస్తే హొటల్స్ లో విపరీతంగా ధరలు ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధాకరం వ్యక్తం చేశారు. అంతే కాకుండా దేవాలయ కేంద్రంగా ఉన్న నిత్యాన్నసత్రం కూడా భక్తులు చేరుకునేందుకు దూరంగా ఉండటం భక్తులకు పెద్ద సమస్యగా మారిందన్నారు. భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ పలు సమస్యలను ఎమ్మెల్యేకు అందించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ కొకల సందీప్ భజరంగ్ దళ్ యాదాద్రి భువనగిరి జిల్లా కో-కన్వీనర్ మార్క శ్రవణ్ కుమార్ ఆలేరు మండల సంయోజక్ ప్యారపు శివకృష్ణ రాజా పేట మండల సంయోజక్ సట్టు నాని నల్ల గణేష్ గౌరయిపల్లి భజరంగ్ దళ్ గ్రామ శాఖ అధ్యక్షులు దుశెట్టి పవన్ కుమార్ భజరంగ్ దళ్ కార్యకర్త మధు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పై ఆలేరు పోలీస్ స్టేషన్ లో బిఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి ఆగస్టు 24:** గత పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భువనగిరిలో ప్రచారం చేసిన సమయంలో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి మీద ప్రమాణం చేసుకుంటూ ఏక కాలంలో యావత్తు తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలకు రెండు లక్షల రుణమాఫీ 2024 ఆగస్టు 15 లోపు చేస్తానని హామీ ఇచ్చి తెలంగాణ రైతులను మోసం చేశారని ఆరోపిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ మాజీ సర్పంచ్ దాసి సంతోష్ జనరల్ సెక్రెటరీ కుండే సంపత్ ఆత్మ కమిటీ చైర్మన్ జల్లి నరసింహులు ఏఎంసి మాజీ డైరెక్టర్ పత్తి వెంకటేష్ నియోజకవర్గ యువజన నాయకులు బీజని మధు బీసీ సెల్ అధ్యక్షుడు కటకం సిద్దిరాజు మాటూరు రవి బాలకిషన్ సోషల్ మీడియా కన్వీనర్ కటకం బాలరాజు రైతులు పాల్గొన్నారు.

## నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. తుమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ కూడా ఒకటి అన్నారు. ఈ నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశామన్నారు. తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని అక్రమ నిర్మాణాలను అన్నింటినీ కూల్చివేసినట్లు తెలిపారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది కలిసి కూల్చివేసినట్లు వెల్లడించారు. చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో ఒక ఎకరా 12 గుంటల్లో... అలాగే బఫర్ జోన్‌లోని 2 ఎకరాల 18 గుంటల్లో ఎన్ కన్వెన్షన్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవన్నారు. గతంలో అనుమతుల కోసం ప్రయత్నించినప్పటికీ... అనుమతులు రాలేదన్నారు.

**హైకోర్టు స్టే ఇచ్చిందనేది అవాస్తవం: హైడ్రా**

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై గతంలో హైకోర్టు స్టే ఇచ్చిందని చెబుతున్నారని, కానీ అలాంటి స్టే ఏదీ లేదని హైడ్రా స్పష్టం చేసింది. స్టే ఇచ్చిందని చెప్పడం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఈరోజు మాత్రం కోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు తీర్పును పాటిస్తామని తెలిపింది. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినందునే కూల్చేసినట్లు తెలిపింది. తమ కట్టడాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం గతంలో చాలా ప్రయత్నాలు చేసినట్లు వెల్లడించింది. కానీ ఆ విజ్ఞప్తులు తిరస్కరణకు గురయ్యాయని తెలిపింది. తాము చట్ట ప్రకారమే కూల్చివేతలు చేపట్టామని హైడ్రా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎన్ కన్వెన్షన్ జీరోగా మారిందని పేర్కొంది.

## ప్రొ. సందీప్ ఘోష్‌పై సీబీఐ కేసు నమోదు

**కోల్‌కతా,** ఆగస్ట్ 24: ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఆర్థిక అవకతవకలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్‌పై సీబీఐ శనివారం కేసు నమోదు చేసింది. ప్రొ. ఘోష్‌పై కేసు నమోదు చేయాలని కోల్‌కతా హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు నమోదు చేసింది. ప్రొ. సందీప్ ఘోష్‌పై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో వాటిపై సీబీఐ విచారణ జరపనుంది. దాంతో సిట్ అధికారులు శనివారం ఉదయం కోల్‌కతాలో నిజాం ప్యాలెస్‌లోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి.. ప్రొ. ఘోష్‌కు సంబంధించిన అన్ని పత్రాలు అందజేసినట్లు సీబీఐ అధికారిక వర్గాలు వెల్లడించాయి.


# కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ రాజకీయ అజ్ఞాని

**డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు**



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగస్టు 23:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ ని పకడ్బందీగా నిర్వహిస్తుందని కొన్ని సాంకేతిక లోపాల వల్ల కొద్ది మంది రైతులకు రావడంలో ఆలస్యం జరిగిందని వాటన్నింటినీ సరిదిద్ది వందశాతం రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది కానీ కోరుట్ల ఎమ్మెల్యే రాజకీయ అవగాహన లేక తను చేపట్టిన ధర్నాలో రైతులు లేనే లేరు కేవలం టి ఆర్ ఎస్ నాయకులు మాత్రమే ఉన్నారు కోరుట్ల నియోజకవర్గం లో ప్రజలందరూ గమనిస్తున్నారు అని అన్నారు తప్పకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగుతుందని త్వరలోనే రాష్ట్రంలోని షుగర్ ఫ్యాక్టరీ లను తెరిపిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బెజ్జరాపు శ్రీనివాస్ అన్నారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మండల ఉపాధ్యక్షులు ఇల్లెందుల రాజు అడ్వకేట్ అబ్దుల్ హఫీజ్ పొట్ట ప్రేమ్ కంబ సురేష్ జబ్బార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## అడ్డ గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఐఓ రామకృష్ణ



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి ఆగష్టు 24:** అడ్డ గూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్.రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ లోనే లాజిస్టికల్ సదుపాయాలను ఐ ఎల్ ఆర్ వ్యాక్సిన్ లాజిస్టిక్ ఫైల్స్ ను వ్యాక్సిన్ నిల్వ స్థాయిలను ఫార్మసీని ఆస్పత్రిలోని రికార్డులను మందులను మౌలిక సదుపాయాలను పరిశీలించారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ కు అన్ని రికార్డులను ఆఫ్ లైన్ ఆన్ లైన్ లో సమయానికి నమోదు చేయాలని సూచించారు ఈ సందర్భంగా డిఐఓ రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మందులు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమియాలజిస్ట్ నరసింహులు ఎంపిహెచ్ఎ ( యం ) వెంకట్ హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైరల్ అవుతున్న పోలీసు డ్యాన్స్

**ముంబాయి :** ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసులు యూనిఫామ్ లో డ్యాన్స్ చేస్తూ ఆనందంగా కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వేదికగా వైరల్గా మారింది. అయితే అప్పుడు వాళ్లకు తెలీదు. ఆనందంగా డ్యాన్స్ చేస్తున్నామని మాత్రమే అనుకున్నారు. వాళ్లు చేసిన తప్పు ఏంటేంటే యూనిఫామ్లో ఉండి డ్యాన్స్ చేయడం. ఈ క్రమంలోనే వారికి ఊహించని షాక్ తగిలింది. ఈ విషయం పై అధికారుల దృష్టికి చేరగా.. మూడు నెలల పాటు వీరిని సస్పెన్షన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే? నాగ్పూర్లోని తహసీల్ పోలీస్ స్టేషన్ నుండి ఏఎస్ఐ సంజయ్ పాటంకర్, హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ ఖయ్యూమ్ గని, భాగ్యశ్రీ గిరి, కానిస్టేబుల్ నిర్మలా గావ్లీలను డ్యాన్స్ చేస్తూ సందడి చేసిన వీడియో ఒకటి ఇంటర్నెట్లో జోరుగా వైరల్ అవుతుంది. ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల తర్వాత అధికారులు ప్రముఖ బాలీవుడ్ పాట అయిన 'ఖైకే పాన్ బనారస్వాలా' కి డ్యాన్స్ చేశారు. ఇదంతా సదరు పోలీసు సిబ్బంది వీడియో తీశారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో అప్ లోడ్ చేయగా.. మిశ్రమ స్పందన వచ్చింది. కొందరు అధికారులు ఒకే అన్నారు.మరికొందరు నాట్ ఒకే అన్నారు.చివరకు వీడియో ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. దీంతో వీరిపై చర్యలు తీసుకున్నారు. డ్యాన్స్ చేసిన నలుగురిని సస్పెండ్ చేస్తూ.. జోన్-3 ఇన్చార్జ్ డీసీపీ రాహుల్ మద్నే ఆదేశించారు. యూనిఫామ్కి ఒక రెస్పెక్ట్ ఇవ్వాలని.. పదే పదే డ్యాన్సులు చేస్తూ పోలీసుల పరువు తీయొద్దని వార్నింగ్ ఇచ్చారు. కాగా ప్రస్తుతం ఈ విషయం వైరల్గా మారింది.

## కోర్టులో కన్నీళ్లు పెట్టుకున్న సంజయ్ రాయ్

**కోల్ కత్తా :** కోల్‌కతా కేసు నిందితుడు సంజయ్ రాయ్ కోర్టులో కన్నీళ్లు పెట్టుకున్నాడు. తనకేమీ తెలియదని, అమాయకుడినని జడ్జ్ ముందు ఏడ్చాడు. 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీకి కోర్టు అనుమతినిచ్చే ముందు ఇలా ఎమోషనల్ అయ్యాడు సంజయ్ రాయ్. ఇప్పటికే లై డిటెక్టర్ టెస్ట్ చేసేందుకు కోర్టు అంగీకరించింది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే...ఇప్పుడు ఉన్నట్టుండి నిందితుడు కన్నీళ్లు పెట్టుకోవడం కీలకంగా మారింది. పైగా తనను ఎవరో ఇరికించారని చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ చేసింది. లై డిటెక్టర్ టెస్ట్ తరవాత తాను నిర్దోషి అని అందరికీ తెలుస్తుందని అన్నాడు.

## మర్రి పోచయ్య కుటుంబాన్ని పరామర్శించిన కొమిరెడ్డి విజయ్ ఆజాద్



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి ఆగష్టు 24:** ఇటీవల మెట్ పల్లి పట్టణ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య మృతి చెందడంతో విచారం వ్యక్తం చేస్తూ శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కొమిరెడ్డి విజయ్ ఆజాద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తమ కుటుంబంతో వ్యక్తిగత అనుబంధం ఉన్న మర్రి పోచయ్య చిన్న వయసులోనే అకాల మరణం చెందడం తమను బాధించిందని వార్డు కౌన్సిలర్ గా తన వార్డు అభివృద్ధి కొరకు చిత్తశుద్ధితో కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం వ్యక్తిగతంగా తమకు వార్డు ప్రజలకు తీరని లోటని అన్నారు. ఆయన వెంట పార్టీ పట్టణ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల హనుమాండ్లు యాదవ్ న్యాయవాది సురభి అశోక్ తదితరులు ఉన్నారు.

# మళ్లీ హీటెక్కిన రుణమాఫీ పాలిటిక్స్

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్, కాలేదని బీఆర్ఎస్ నేతలు సవాళ్లు ప్రతి సవాళు విసురుకుంటున్నారు. 49వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని, డిసెంబర్ నెలలో చెప్పిన రేవంత్ సర్కార్.. కడుపు కట్టుకుంటే చాలు ఒక్క ఏడాదిలో 40వేల కోట్ల రుణమాఫీ చేస్తానని జనవరి ప్రకటించింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు.. కేబినెట్‌లో నిర్ణయించిన 31వేల కోట్లు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టారు. బడ్జెట్ కేటాయింపుల్లో 26వేల కోట్లకు కుదించారని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆగస్టు15 నాడు రుణమాఫీ పూర్తయిందని, 17వేల కోట్లను మాఫీ చేశామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.తాజాగా యాదాద్రి ఆలయ కేంద్రంగా రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. లక్ష్మీ నరసింహా స్వామి సాక్షిగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ల మధ్య రుణమాఫీ వివాదం ముదురుతోంది. రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామి సాక్షిగా ప్రమాణం చేసి మాట తప్పారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రుణమాఫీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజల్ని మోసం చేశారని మండిపడుతున్నారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి మాట తప్పారని, ప్రజలకు ఆ పాపం చుట్టుకోకుండా మాజీ మంత్రి హరీష్‌రావు ఆలయాల యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా యాదాద్రి ఆలయానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అనుచరులతో కలిసి హరీష్ రావు వచ్చారు. ఆలయ తూర్పు రాజగోపురం ఎదుట మాడవీధుల్లో ఓ పూజారితో పాప పరిహార సంకల్ప ప్రమాణం చేశారు. తర్వాత ఆలయంలోకి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు.రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్రానికి కీడు లేకుండా చేయాలని పూజలు చేశామని చెప్పారు. “స్వామి? ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రిని క్షమించు, తెలంగాణ ప్రజలపై దయ ఉంచు” అని వేడుకున్నానని అన్నారు. సీఎం రేవంత్ రైతులను మోసం చేయడమే కాదు.. దైవ ద్రోహానికి కూడా పాల్పడ్డాడని హరీష్ మండిపడ్డారు. పాప పరిహారం కోసం ఆలయాల యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు రుణమాఫీ జరిగే వరకు తమ పోరాటం ఆగదని హరీష్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆలయాన్ని నీటితో శుద్ధి చేసిన కాంగ్రెస్ నేతలు..యాదాద్రి ఆలయంలో బీఆర్ఎస్ నేతలు పాప పరిహార సంకల్ప ప్రమాణం చేయడం వివాదంగా మారింది. ఆలయ తూర్పు రాజగోపురం మాడవీధుల్లో హరీష్ రావు.. పాప పరిహార సంకల్ప ప్రమాణం చేసిన ప్రాంతం, ఆలయ పరిసరాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ నేతలు నీటితో శుద్ధి చేశారు. బీఆర్ఎస్ నేతలు పరిహార సంకల్పం చేసి కొండను అపవిత్రం చేశారని.. మాడ వీధుల్లో చీపుర్లు పట్టి ఊడ్చి నీటితో శుద్ధి చేశారు. యాదాద్రి కొండపై బీఆర్ఎస్ నేతలు పాప పరిహార సంకల్పం చేయడం, కాంగ్రెస్ నేతలు నీటితో శుద్ధి చేయడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి.బీఆర్ఎస్ నేతలు యాదగిరిగుట్ట ఆలయాన్ని అపవిత్రం చేశారని, దేవుడి సన్నిధిలో రాజకీయాలు మాట్లాడి హరీష్ రావు ఆలయానికి మైల పట్టించాడని కాంగ్రెస్ నేతలు మండి పడుతున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రైతులను పట్టించుకోని బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. తెలంగాణలోనే పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రంలో.. రాజకీయాలు చేస్తే సహించం. భక్తుల మనోభావాలతో ఆడుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదు..” అని ప్రభుత్వ విప్ “బీర్ల ఐలయ్య బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.మాజీ మంత్రి హరీష్ రావు ఆలయ మాడ వీధుల్లో పాప పరిహార సంకల్ప ప్రమాణం చేయడంపై ఆలయ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తులతో మాడవీధుల్లో పూజలు చేయడంపై దేవస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేని ప్రదేశంలో బిఆర్ఎస్ నేతలు బయటి పూజారులతో మాడవీధుల్లో పూజలు చేశారంటూ అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు.సెక్షన్ 7 రిలీజియస్ యాక్ట్ 1988 ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు ఆలయ ఈవో ఫిర్యాదు చేశారు. దీంతో యాదగిరిగుట్ట పోలీసులు హరీష్ రావు తోపాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, గుర్తుతెలియని పూజారితోపాటు మరో నలుగురిపై యాదగిరిగుట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించారని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల ఆలయ పవిత్రతకు భంగం కలుగుతుందని ఆలయ ఈవో భాస్కరరావు చెబుతున్నారు.రుణమాఫీ వివాదంతో యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

# ఆర్టీసీకి రికార్డు స్థాయిలో 14 .90 కోట్ల ఆదాయం

**హైదరాబాద్ :** ఆర్టీసీ కళా భవన్ లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఎండీ సజ్జనార్,ఇతర ఆర్టీసి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఆర్టీసి డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబానికి కోటి రూపాయలు ప్రమాద భీమ చెక్కును అందజేసారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాలను ప్రదానం చేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసిలో ప్రగతి చక్రం అవార్డ్స్ పొందుతున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు. ఒక మాతృమూర్తి జన్మనిచ్చిన సమయంలో వచ్చే పురిటి నొప్పుల మాదిరి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పాలన వచ్చిన తరువాత ఆర్టీసి పరిస్థితి అలాంటిది. ఆర్టీసి లో గత 10 సంవత్సరాలు ఒక్క బస్సు కొనలేక ఉద్యోగాలు నియామకాలు లేక..15 సంవత్సరాలు దాటిన బస్సులు స్క్రాప్ కి పోతున్న సమయంలో వయస్సు దాటిన వాళ్ళు రిటైర్మెంట్ కి పోతుంటే పని భారం పెరిగి అనేక రకాలు గా సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో ఎండీ వచ్చారు. ఆయన కొంత సంస్కరణలు తెచ్చారు. డిసెంబర్ 9 న మహా లక్ష్మి పథకం ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకి అదృష్ట లక్ష్మి వచ్చింది.కొత్త బస్సులు కొంటున్నం ,3035 ఉద్యోగాలు నియామకాలు చేపడుతున్నాం.. రాబోయే 5 సంవత్సరాల కాలం ముందస్తుగా దృష్టిలో పెట్టుకొని మరిన్ని కొత్త బస్సులు, రెండోసారి ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో విజయవంతం కావడానికి కృషి చేసిన మీకు ప్రభుత్వం పక్షాన ధన్యవాదాలు చెబుతున్న.




ఆర్టీసి మంత్రిగా మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలని అన్నారు. ప్రభుత్వం తరుపున ఆర్థిక పరమైన అంశాలు ఉన్నపటికీ కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయి నుండి ఆలోచిస్తున్నమని అన్నారు. మీ బాండ్స్ 80 కోట్ల పెమెంట్స్ జరిగాయి.. 200 కోట్లు చెల్లించాల్సి ఉంది. దానికి నిధులు తీసుకొచ్చే అది చెల్లించే బాధ్యత మాది. మొన్న రాఖి పండగ రోజు మీ అందరి కృషితో ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీలో ఇంత మంది ప్రయాణం చేశారు అని గర్వంగా చెప్పుకున్నాం. 17 కోట్ల విలువ చేసే మంది మహిళలు ప్రయాణం చేశారు..రికార్డు స్థాయిలో 14 .90 కోట్ల ఆదాయం వచ్చింది. రికార్డు స్థాయిలో 64 లక్షల మంది ప్రయాణం చేశారు. ఇదంతా మీ అందరి కృషితోనే జరిగింది. రవాణా వ్యవస్థలో ఆర్టీసి లేకపోతే పెద ప్రజలకు గమ్యాలకు చేరడానికి ఎన్నో ఇబ్బందులు వస్తాయి. ఆర్టీసీకి మీరు గుండె కాయ లాంటివారు. ఆర్టీసి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక మంత్రి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఎప్పటికప్పుడు నాతో సంప్రదిస్తూ సమీక్షిస్తున్నారు.. దానికి సానుకూలంగా స్పందిస్తున్నారు. ఆర్టీసి ముందుకు పోవడానికి సహకరిస్తున్నారు. ఆర్టీసి మన అందరి సంస్థ..ప్రజల సంస్థ. ప్రభుత్వం వెన్నెముక లో సహకరిస్తుంది. ప్రజాస్వామ్యం లో మంచి చెడు రెండు స్వీకరించాల్సి ఉంటుంది. పని ఒత్తిడి పెరిగి ఉండవచ్చు... ప్రయాణికులు వస్తున్నారు కాబట్టే మన పని ఒత్తిడి పెరిగింది. ప్రయాణికులపై జవాబు దారి లేకుండా వ్యవహరించవద్దు.. అందరితో మంచిగా ఉండాలి. ప్రయాణికులు మన బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు కాబట్టి మన కార్యక్రమాలు జరుగుతున్నాయి. వారి పట్ల మరింత క్రమశిక్షణ గా ఉండాలి. ఆర్టీసి లో రాజకీయ జోక్యం ఉండదని అన్నారు.

మీకు ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురండి. ఆర్టీసి పట్ల సానుకూలంగా ఉండేలా చేస్తాం. 259 రోజుల్లో 81 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. ఆర్టీసి కష్టాల నుండి బయటకు వస్తుంటే చిన్న చిన్న సమస్యలు ఉంటాయి. యాజమాన్యం నుండి నిర్లక్ష్యం లేదు.గత 10 సంవత్సరాల్లో ఆర్థికంగా ఎలాంటి సమస్యలు ఎదుర్కున్నమో మనకి తెలుసు. ఆర్టీసి ఉద్యోగుల పిల్లలకు డిపో ల వారీగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఇన్నోవేషన్ క్రియేట్ చేయాలి. మంచి ఇన్నోవేట్ చేసిన వారిని అవార్డులతో ప్రోత్సహించాలి. వారికి అవార్డు తీసుకునే విధంగా ప్రోత్సాహం కల్పించాలి. ఆరోగ్య రీత్యా వారికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ రంగ ఉద్యోగులకు వర్తించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతా. కారుణ్య నియామకాలు అన్నీ విధాలుగా బాగుండాలి. అందరూ అవార్డు పొందేలా మరింత ముందుకు పోవాలని అన్నారు.

# ఐ ప్యాక్ స్థానంలో సునీల్ కనుగోలు

**హైదరాబాద్ :** వైసీపీకి ఐ ప్యాక్ టీం సేవలందిస్తోందా? లేకుంటే ప్యాకప్ చెప్పేశారా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర అంశం. 2014లో వైసిపి ప్రతిపక్షానికి పరిమితం అయింది.67 స్థానాలతో పటిష్ట పరిస్థితుల్లోనే ఉండేది.ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని ఐ ప్యాక్ టీం సేవలను వినియోగించుకోవడం ప్రారంభించారు జగన్. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రశాంత్ కిషోర్ విశేష సేవలు అందించారు. నాటి ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచడంలో సక్సెస్ అయ్యారు. ప్రజలను కుల మత వర్గాలుగా విభజించి జగన్ వైపు టర్న్ అయ్యేలా చేశారు.2019 ఎన్నికల్లో జగన్ విజయం సాధించడం వెనుక ప్రశాంత్ కిషోర్ పాత్ర ఉంది.అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీకి దూరమయ్యారు ప్రశాంత్ కిషోర్. బీహార్లో సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్నారు.ఈ ఎన్నికల్లో మాత్రం తెలుగుదేశం కూటమికి సహకారం అందించారు పీకే. ఎన్నికల్లో జగన్ కు దారుణ ఓటమి తప్పదని కూడా ముందుగానే జోక్యం చెప్పారు. పరిస్థితి అలానే మారింది. జగన్ కు దారుణ పరాజయం ఎదురయింది.ప్రశాంత్ కిషోర్ వెళ్ళిపోయిన తర్వాత ఆయన సమకాలీకుడు రుషిరాజ్ సింగ్ నేతృత్వంలో ఐ ప్యాక్ టీం సేవలందించడం ప్రారంభించింది. గత ఐదేళ్లుగా వైసీపీకి రాజకీయ వ్యూహకర్త బృందంగా పనిచేసింది. కానీ ఓటమి ఎదురైంది. దీంతో ఐప్యాక్ టీంకు జగన్ ప్యాకప్ చేసినట్లు ప్రచారం జరిగింది. ఓటమి తర్వాత ఐ ప్యాక్ టీం ఎక్కడ కనిపించడం లేదు. వారి కార్యాలయం సైతం ఖాళీ అయినట్లు తెలుస్తోంది.ఇప్పుడు పార్టీ ప్రక్షాళన పై జగన్ దృష్టి పెట్టారు. నమ్మకమైన నేతలకు కీలక పదవులు కట్టబెట్టారు. అందులో భాగంగానే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, గడికోట శ్రీకాంత్



రెడ్డి లకు ప్రధాన కార్యదర్శి పదవులు అప్పగించారు. వారి ద్వారా పార్టీని నడపాలని ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఐ ప్యాక్ టీం ఉందా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది. అయితే ఐప్యాక్ టీమ్ ను వదిలించుకున్నారని.. కొత్త టీం ను ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారని ప్రచారం సాగుతోంది.జగన్ మదిలో సునీల్ కొనుగోలు ఉన్నారని ప్రారంభమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి సునీల్ కొనుగోలు సేవలు అందిస్తున్నారు. ఈయన సైతం ప్రశాంత్ కిషోర్ కు సమకాలీకుడు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించారు. అధికారంలోకి తీసుకు రాగలిగారు. తెలంగాణలో సైతం మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకురావడంలో వ్యూహకర్త సునీల్ కొనుగోలు పాత్ర ఉంది. ఇప్పుడు ఆయనకు భారీగా ఆఫర్ చేసి.. వ్యూహకర్తగా తేవాలని జగన్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా సేవలు అందిస్తున్న సునీల్ కొనుగోలు అందుకు అంగీకరిస్తారా? లేదా? చూడాలి.

## రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు



-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. కాంగ్రెస్ పాలన పుణ్యమా అని మళ్లీ.. “నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు” అనే రోజులు పునరావృతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పటల్స్ ఘనతను చాటేలా వార్తలు వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల అధ్వాన్న పరిస్థితుల గురించి రోజూ వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “పడకేసిన ప్రజారోగ్యం, రోగుల మందులు ఎలుకల పాలు, కుర్చీలోనే గర్భిణీ డెలివరీ, ఒకే బెడ్ పై ముగ్గురికి ట్రీట్మెంట్” ఇవన్నీ ఈ ఒక్క రోజు పత్రికల్లో వైద్య ఆరోగ్యశాఖపై నిర్వాకంపై వచ్చిన వార్తా కథనాలు అని ప్రస్తావించారు. ప్రజారోగ్య సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వా నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని తెలిపారు. వానాకాలం వస్తున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఆస్పత్రుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించకపోవడం పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల మలేరియా, డెంగీ లాంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా వైరల్ ఫీవర్లతో ప్రతి ఇద్దరిలో ఒకరు బాధపడుతున్నారని.. ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గడచిన నెలన్నర కాలంలో 5246 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే 36% డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయని అన్నారు. జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు? అని మండిపడ్డారు. మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు ఏమని సమాధానం చెబుతుందని నిలదీశారు. మీకు రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంతోమంది కుటుంబాల్లో అంతులేని దుఃఖాన్ని మిగిలించిందని అన్నారు. ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని స్పష్టం చేశారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మరణించిన వారికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటే ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య ఆరోగ్యశాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ పర్యాటక అభివృద్ధికి చేయూత నివ్వండి

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. దీనిపై కేంద్రమంత్రి షకావత్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ టూరిజం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల మార్గాలను అన్వేషిస్తున్నామని, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లుతున్నామని అన్నారు. ఎకో, వాటర్ బాడీస్, టెంపుల్, హెల్త్ అండ్ వెల్నెస్ టూరిజంకు తెలంగాణ అనుకూలంగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వార్షిక బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని చెప్పారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధికి.. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమని, నిధులు కేటాయించాలని గజేంద్ర సింగ్ షెకావత్ ను కోరినట్లు మంత్రి తెలిపారు. సీయం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నూతన పర్యాటక విధానం తీసుకువచ్చి... తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## ఆశల పల్లకిలో పల్లె పోరు!

-మొదటిపేజీ తరువాయి

వార్డుల వారీగా పర్యవేక్షించనున్నారు. కాగా 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది.

**ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్.**

వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటరు జాబితా సిద్ధం చేసి జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శన. వచ్చే నెల 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా, మండల స్థాయి సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, సలహాల స్వీకరణతో పాటు ప్రకటించిన ఓటరు జాబితాల అందజేత. వార్డులు, గ్రామాల వారీగా సిద్ధం చేసిన జాబితాలపై సెప్టెంబరు 7 నుంచి 13 వరకు అభ్యంతరాల స్వీకరణ. వచ్చిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి 19వ తేదీన పరిష్కరించాలి. జిల్లాలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో సిద్ధమైన ఓటర్ల తుది జాబితాలను వచ్చే నెల 21న ప్రకటించాలి.

## హైడ్రా పేరుతో హైడ్రామా..

-మొదటిపేజీ తరువాయి

నేడు అక్రమ కట్టడాలని కూల్చేస్తూ డ్రామాలాడుతున్నారు. అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారు? విద్యుత్, నీరు, రోడ్ల సదుపాయాలు ఎలా కల్పించారు? ఇప్పుడు అవన్నీ కూడా లోతుగా చర్చించాల్సిందే. ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయమైనా అందరికీ సమానంగా వర్తింపజేయాలి. ఇష్టం వచ్చినట్లు చేస్తామనడం సరికాదు. గతంలో అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకోవాలి” అని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

**రాజకీయ డ్రామాలు..**

హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్(%దీ=వా%), కాంగ్రెస్(%జశీఅస్త్రతీవంం%) నేతల డ్రామాలు రక్తికట్టించేలా ఉన్నాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. మంచి ఉద్దేశంతో హైడ్రా ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ చెబుతోందని.. అదే నిజం అయితే ముందు బీఆర్ఎస్ నేతలు ఆక్రమించి కట్టిన భవనాలను కూల్చివేయాలంటూ ఎంపీ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫామ్ హౌస్‌లు కూల్చడానికి ఎందుకు వెనకాడుతున్నారో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని అన్నారు.

**వాళ్లంటే భయం..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి భయపడుతున్నారని ఎంపీ రఘునందన్ విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కబ్జాలు పెరిగాయని, కేసీఆర్ హయాంలో ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా జన్వాడలో కేటీఆర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఫామ్ హౌస్ కూల్చివేయాలంటూ ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కబ్జాలు చేసిన నేతలపై కేసులు పెట్టామని అధికార పార్టీ నేతలు చెప్తున్నారని, అదే నిజమైతే వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని ఎంపీ ప్రశ్నించారు.

# రాష్ట్ర గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి :** గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఘనపురం మండలం కోటగుళ్ళ గణపేశ్వరాలయానికి వస్తున్నారని తెలిపారు. పర్యటనకు చేయాల్సిన ఏర్పాట్లుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు వారి కేటాయించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి దేవాలయ పరిసరాలు పరిశుభ్రం చేయాలని డిపిఓ కు సూచించారు. అన్ని శాఖల అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రహదారులలో గుంతలు లేకుండా మరమ్మత్తులు నిర్వహించి పరిశుభ్రం చేయాలన్నారు. విధులు కేటాయించిన సిబ్బందికి పాసుల జారీ చేస్తామని పాసులు లేకపోతే అనుమతించరని, ప్రతి ఒక్కరు వి.ఐ.పి ప్రోటోకాల్ పాటించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ... అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఉంటుందని విధులు నిర్వహించే సిబ్బంది తప్పని సరిగా పాసులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిపిఓ నారాయణరావు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సిపిఓ శామ్యూల్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్, డిఎస్పీ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మాసిటీ,సెజ్ లో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

**పరవాడ :** పరవాడ మండలంలో ఉన్నటువంటి ఫార్మాసిటీ, సెజ్ లో కార్మికులకు ప్రాణాలకు రక్షణ కల్పించాలి డిమాండ్ చేస్తూ శనివారం లంకెలపాలెం నుండి పరవాడ వెళ్లే రోడ్ పై బ్రిడ్జి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎసెన్షియా, సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాన్ని పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, కార్మికుల ప్రాణాలు రక్షణ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఈ రాస్తారోకోలో ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి కే లోకనాథం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 18 మంది ప్రాణాలను బలిగొన్న ఎస్ఎస్సి యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం అన్నారు. యాజమా న్యాలకు రాయితీ ఇస్తూ కార్మిక చట్టాలు అమలు చేయకపో వడం వల్లే తరుచు ప్రమాదాలు జరుగుతు న్నాయని విమర్శిం చారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికుల విధులకు రావాలంటే క్షణక్షణం భయాందోళన పడుతూ విధులు నిర్వహించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్ఈజెడ్, పరవాడ ఫార్మసిటీలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడం కార్మికుల ప్రాణాలు పోవడానికి కారణం అవుతుంది అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ప్రాథమిక చికిత్స అయిన లేకపోవడం వల్ల విశాఖపట్నం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ లోగానే కార్మికులు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో బర్నర్ వార్డుతో కూడిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగిలిన వారికి మెరుగైన వైద్య సదుపాయం ప్రభుత్వ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు పరిశ్రమలు తనిఖీ చేసి భద్రతల ప్రమాణాలు మెరుగుకు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కర్ణం వెంకట్రావు, ఫార్మసిటీ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, సంతోష్, రమేష్, నాగరాజు, దేవ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.




# యోగాతో సార్వత్రిక శక్తి, ఆధ్యాత్మిక జ్ఞానం

జాతీయ పోటీలకు వేదికగా కరీంనగర్
ఛాంపియన్లుగా తిరిగి రావాలి..
కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** అట్టహాసంగా జిల్లాస్థాయి యోగా పోటీలు మన పూర్వీకులు అందించిన వారసత్వ సంపద అయిన యోగాతో కేవలం ఆధ్యాత్మిక జ్ఞానమే కాకుండా సార్వత్రిక శక్తి అలవర్చుకునే అవకాశం ఉందని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. జిల్లా యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి యోగాసనా పోటీల ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వయసుకు అనుగుణంగా ఇష్టమైన క్రీడల్లో పాల్గొనడం,యోగా చేయడం తప్పనిసరి అన్నారు. 30 ఏళ్ళ వయసు వచ్చేవరకు జీవితంలో ఏమి చేయలేదో, ఏమి చేయాలో యోగా చెబుతుందన్నారు. పాఠశాలలు, ఇళ్లలో పిల్లలు కేవలం ధ్యానానికే పరిమితం కాకుదదని, యోగాతో అనంత ప్రతిభ సొంతం చేసుకోవాలన్నారు. కారాగారంలో ఉండే ఖైదీలలో సైతం యోగాతో మానసిక పరివర్తన కలుగుతుందని చెప్పారు. కేవలం క్రీడలనే సహ పాఠ్యాంశాలని ప్రధానంగా ఏర్పడిన కరీంనగర్ ప్రాంతీయ పాఠశాలలో 2006 నుండి ఇప్పటివరకు ఒక్క విద్యార్థి ఫెయిల్ కాలేదన్నారు. యోగ ఒక కరికులంగా భావించాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగ ఆసనాలు చూస్తే ఆనందం, గర్వంగా ఉందన్నారు. వీరిలో ఎముకలు, కండరాలు ఉన్నాయా, రబ్బర్ బాండ్ లా సాగుతూ చేసిన యోగాసనాలు చిన్నారుల ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రస్థాయి పోటీలో సైతం మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో జాతీయస్థాయి యోగా పోటీల వేదికగా కరీంనగర్ నిలవాలన్నారు. జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుండి కరీంనగర్ జిల్లా ఛాంపియన్ గా నిలిచిన గొప్ప చరిత్ర ఉందన్నారు. ఆస్ఫూర్తిని 20 ఏళ్లుగా క్రీడాకారులు కొనసాగించేలా విశేషంగా కృషి చేస్తున్న ఘనత అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిద్ధారెడ్డిది అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి ఎక్కువ మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైతే జాతీయ స్థాయి పోటీలను కరీంనగర్లో నిర్వహించుకుందామని తెలిపారు. అనంతరం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్. సిద్ధారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. జనార్దన్ రెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి. రమేష్ రెడ్డి, డి ఈ ఓ కార్యాలయం సూపరిటెంట్ ఎం నరసింహస్వామి జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, యోగా కోచ్ లు సంపత్ కుమార్ కిష్టయ్య రామకృష్ణ మల్లేశ్వరి అశోక్ కోటేశ్వరరావు ప్రవీణ స్వరూప చారి వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్ నర్సయ్య పి శ్రీనివాస్ సత్యానంద్ సూర్య ప్రకాష్ స్నేహలత హరి ప్రసాద్ సహ క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఇంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఈ పోటీలను ఇలా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.




# కన్నాల వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులకు ప్రతి నెల వేతనం అందజేస్తాం

-మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి
-కన్నాల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంథని మున్సిపల్ పాలకవర్గం

**మంథని :** కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులకు మా కుటుంబ సభ్యుల సహకారముతో ప్రతి నెల వేతనం అందజేస్తామని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి అన్నారు. శనివారం మంథని మండలం కన్నాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి తన పాలకవర్గ సభ్యులతో కలిసి సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో మొక్కలను నాటారు.. ఆలయంలో పనిచేస్తున్న అర్చకులకు ఖర్చుల నిమిత్తం 9వేల రూపాయలను చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రమా సురేష్ రెడ్డి మాట్లుడుతూ మా కుటుంబ సభ్యులు మస్కుల నారాయణ రెడ్డి కుమారుడు శ్రావణ్ రెడ్డి సహకారముతో ప్రతి నెల 9వేల రూపాయలు ఆలయ అర్చకులకు వచ్చే విధంగా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముస్కుల సురేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ శ్రీపతి బాణయ్య, కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి పాపారావు, కుర్ర లింగయ్య,కొట్టె పద్మ రమేష్, వి.కె రవి, వేముల లక్ష్మి సమ్మయ్య , భక్తులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్య ముఠా అరెస్టు

**మేడ్చల్ :** హైదరాబాద్ నగరు చివారు ప్రాంతం ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధి నారాపల్లి లోని దివ్యనగర్ లో నార్కోటిక్ నార్కోటిక్ డ్రగ్ అల్ప్రాజోలం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు జరిపారు. ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసారు. 30 లక్షల విలువ చేసే మూడు కిలోల దూరంతో పాటు ముడి సరుకు తయారీ సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. తరువాత దివ్యా నగర్ లో నార్కోటిక్ తయారీ కేంద్రం వద్ద ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. సూర్యాపేటకు చెందిన మేన శ్రీనివాస్ బీఎస్సీ విద్యను అభ్యసించి ఓ ఫార్మా కంపెనీలో కెమిస్ట్రీగా పని చేశారు. శ్రీనివాస్ త్వరగా కోటీశ్వరులు కావాలనే అతి ఆలోచనతో, తన మిత్రులు కాకర చంద్రశేఖర్, పోలిశెట్టి రాంబాబు, తాడి లక్ష్మణ్ లను సంప్రదించాడు. ఆల్ప్రాజోలం తయారీకి తయారీకి రాంబాబు ఆర్థిక సహాయాన్నిఅందించగా, శ్రీనివాస్ కూకట్పల్లిలోని నర్మదా కెమికల్స్ యజమాని రాజేశ్వరరావును సంప్రదించి ఆల్ప్రజోలం తయారీ కేంద్రానికి ఫార్ములా, ముడిసరుకులు, పరికరాలను సేకరించారు. శ్రీనివాస్ స్నేహితుడు సునీల్ నిజామాబాదులో ఉంటున్నాడు. అతనిని శ్రీనివాస్ కలువగా శ్రీనివాస్ తయారు చేసి అల్ప్రజోలంను కొనుగోలు చేసి సరఫరా చేస్తానని అంగీకరించాడు ఇలా అందరూ కలిసి ముఠాగా ఏర్పడి ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశాల ప్రాంతం అయిన నారపల్లిలోని దివ్య నగర్ ప్రాంతం అనువుగా ఎంచుకొని నార్కోటిక్ డ్రగ్ ఆల్ ప్రోగ్రాంలో తయారు చేస్తున్నారు. సుమారు సుమారు మూడు కేజీల ఆల్ ప్రోగ్రామ్ డ్రగ్ తయారు చేసి అమ్మకానికి రెడీగా ఉన్న సమయంలో, సమాచారం అందుకున్న ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ అధికారులు తయారీ కేంద్రంపై దాడికి దిగారు. అనుమానితులైనటువంటి ఏ వ్యక్తులకైన ఇంటిని అద్దెకిచ్చే ముందు అన్ని విధాల వారిని పరిశీలించాలని ఇంటి యజమానులకు కమలహాసన్ రెడ్డి సూచించారు.. జాగ్రత్తలు పాటించకుండా ఇంటిని అద్దెకిచ్చిన యజమానులపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని కమలహాసన్ రెడ్డి హెచ్చరించారు. ఈ నార్కోటిక్ తయారి కేంద్రం గుర్తించి నిందితులను పట్టుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులను డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి అభినందించారు..

## జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి తాకిన హైడ్రా సెగ

**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ పరిధిలోని నాడెం చెరువు బఫర్ జోన్ ను ఆక్రమించి అక్రమ నిర్మాణ నిర్మాణాలు చేపట్టారని రాజేశ్వర్ రెడ్డి ఛైర్మన్ గా ఉన్న అనురాగ్ ఇన్సిట్యూషన్స్ పై పోచారం ఐటి కారిడార్ పిఎస్ పరిధిలో కేసు నమోదు అయ్యింది . సుమారు అరవై ఎకరాల నాడెం చెరువుకు సంబంధించి పధ్నాలుగు ఎకరాల బఫర్ జోన్ ఉంది . అయితే బఫర్ జోన్ లో సుమారు ఎకరన్నర భూమిని ఆక్రమించి అనురాగ్ ఇన్స్టిట్యూషన్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనీ , చర్యలు తీసుకోవాలంటూ నిన్న ఇరిగేషన్ శాఖ ఏఈ పరమేష్ పోచారం ఐటి కారిడార్ పీఎస్ లో ఫిర్యాదు చేశారు. వెనువెంటనే సదరు ఫిర్యాదు పై ఎఫ్ఐఆర్ కూడా నమోదు కావడంతో ఏ క్షణంలో అయినా కాలేజీ బిల్డింగ్స్ ను కూల్చివేసే అవకాశం ఉందని సమాచారం.

## కూల్చివేతలపై పారదర్శకంగా వ్యవహరించండి

**హైదరాబాద్ :** మంచినీటి సరస్సులు, చెరువులను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన కూల్చివేతలను పారదర్శకంగా కొనసాగించాలని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ను కూల్చిన తరహాలోనే ఎంతటి వారినైనా వదలకుండా జరపాలని అన్నారు. తన పర బేధం లేకుండా చెరువులను రక్షించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. మీ ప్రభుత్వంలో కొనసాగుతున్న ముగ్గురు మంత్రులు కూడా ఎన్కన్వెన్షన్ తరహాలోనే చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని వారివి కూడా కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నెల రోజులు టైం ఇస్తున్నామని కూల్చివేతలు జరపకపోతే తానే స్వయంగా హైకోర్టును ఆశ్రయించి కూల్చివేతలు జరిగేలా చూస్తారని కేఏ పాల్ అన్నారు.

## నేలకూలిన భారీ వృక్షం..

**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రధాన రహదారి లోతుకుంట రాష్ట్రపతి నిలయం మార్గంలో భారీ వృక్షం ఈదురుగాలికి అకస్మాత్తుగా రోడ్డు మధ్యలో పడిపోయింది. దాంతో రెండు హై టెన్షన్ ఎలక్ట్రిక్ పోల్స్ పడిపోయి కరెంటు తీగలు రోడ్డుపై వేలాడుతున్ఆయి. స్థానికులనుంచి సమాచారం అందుకున్న ఎలక్ట్రిసిటీ, మరియు డిజాస్టర్ ఇన్ఫోసిమెంట్ టీం రంగంలోకి దిగి ఏలాంటి హాని కలక్కుండా సహాయక చర్యలు చేపట్టారు. ఘటనతో ట్రాఫిక్ జామ్ కావడంతోవాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కోన్నారు. కరెంటు నిలిపివేసిన విద్యుత్ సిబ్బంది కొన్ని గంటలపాటు విద్యుత్ అంతరాయం కొనసాగుతుంది చుట్టూ ఉన్న కాలనీ వాసులకు విద్యుత్ సిబ్బంది సమాచారంఅందించారు.

## వరస చోరీలు.. దొంగను హతమార్చిన పళ్ వ్యాపారి

**కూకట్ పల్లి :** తన పళ్ళ బండి వద్ద తరచూ చోరీకి పాల్పడుతున్న ఓ దొంగను పళ్ళ వ్యాపారి హత్యకు పాల్పడిన సంఘటన కె.పి.హెచ్.బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొహమ్మద్ ఉస్మాన్ అనే వ్యక్తి అడ్డగుట్టలో అరటిపళ్ళను తోపుడు బండి పై అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఉస్మాన్ కి, దత్తు(26) అనే చిల్లర దొంగతో పరిచయం ఉంది. ఉస్మాన్ పళ్ళ బండి వద్దకు వచ్చే దత్తు, బండి పై గల్లా పెట్టె నుండి డబ్బులు ఎత్తుకొని వెళ్ళేవాడు. గత కొద్ది రోజుల క్రితం, పళ్ళ బండికి వద్దకు వెళ్లిన దత్తు, ఉస్మాన్ సెల్ ఫోన్ చోరీ చేశాడు. రాత్రి తిరిగి ఉస్మాన్ అరటి పండ్ల బండి వద్దకు రాగానే, ఉస్మాన్ దత్తుతో వాగ్వివాదానికి దిగి, అక్కడే ఉన్న కర్రతో దత్తు పై దాడి చేశాడు. దత్తు తలకు తీవ్రగాయాలు అవ్వటంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, హత్య కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

54మంకీ పాక్స్పై తెలంగాణ సర్కార్ అప్రమత్తం..

## గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు.

**హైదరాబాద్ :** విదేశాల్లో డేంజర్ బెల్స్ మోగిస్తున్న మంకీపాక్స్ వ్యాధిపై తెలంగాణ సర్కార్ అప్రమత్తమైంది రాష్ట్రంలోకి వ్యాధి ప్రవేశించకుండా పలు చర్యలు తీసుకుంది. ఎయిర్ పోర్ట్లల్లో ప్రయాణికులను చెక్ చేసి. ఆరోగ్య సమస్యలుంటే వారిని ప్రత్యేకంగా ఉంచుతోంది మంకీపాక్స్ వ్యాప్తిపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనుమానితులను ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండటానికి గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రులను సిద్ధం చేశారు. ఎంపాక్స్ అనుమానితులను, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందించేందుకు అక్కడే ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. గాంధీ ఆసుపత్రిలో ఎంపాక్స్ చికిత్స కోసం ప్రస్తుతం 20 పడకలు కేటాయించారు. ఇందులో పురుషులకు, మహిళలకు పదేసి పడకలు కేటాయించినట్లు వైద్యులు తెలిపారు. ఫీవర్ ఆస్పత్రిలో ఆరు పడకలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కేసులు నమోదు కాలేదని, కానీ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎంపాక్స్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని చెప్పారు. మంకీ పాక్స్ ప్రస్తుతం పాకిస్థాన్ సహా ఆఫ్రికాలోని పలు దేశాల్లో విజృంభిస్తోంది. కాంగో, నైజీరియా, కామెరూన్ దేశాల్లో కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఆయా దేశాల నుంచి తెలంగాణకు వచ్చే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. అనుమానితులు ఐసోలేషన్లో ఉండటం, లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రిలో చేరాలని వైద్యులు సూచిస్తున్నారు. మంకీపాక్స్ కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసినట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్ కుమారి తెలిపారు. మంకీ పాక్స్ బాధితుల చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంకీపాక్స్ లక్షణాలు: జ్వరం తలనొప్పి ఒళ్లు నొప్పులు, శరీరంలోని వివిధ అవయవాలపై దద్దుర్లు, దురద, వెన్నునొప్పి, చలి, తీవ్ర అలసట. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించడం ముఖ్యం.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com